క్లుప్తంగా

ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలి



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని డాక్టర్ పాతకోట శ్రీనాథ్ రెడ్డి తెలిపారు. స్థానిక లక్ష్య కార్డియాక్, కంటి ఆస్పత్రిలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పేదలను డాక్టర్ పాతకోట శ్రీనాథ్ రెడ్డి పరీక్షించి 28 మందికి ఉచితంగా ఈసీజీ, 8 మందికి ఉచితంగా గుండె స్కానింగ్ పరీక్షలు చేశారు. డాక్టర్ హరిత 36 మంది రోగులకు కంటి వైద్య పరీక్షలు చేసి సూచనలు తెలిపారు. ప్రతి నెల మూడో ఆదివారం ఉచితంగా పేదలకు వైద్య సేవలు అందిస్తున్నట్లు డాక్టర్ శ్రీనాథ్ రెడ్డి తెలిపారు.

చాముండేశ్వరిదేవికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో చాముండేశ్వరి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వైఎంఆర్ కాలనీలోని చాముండేశ్వరీ దేవి అమ్మ వారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున అమ్మవారికి పంచామృతాభిషేకం, అవభృతస్నానం, కుంకుమార్చన చేసి అలంకరించారు. అమ్మవారికి నవహారతులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

పది పరీక్ష పత్రాల మూల్యాంకనం నిధులను చెల్లించాలి

కడప ఎడ్యుకేషన్: పదో తరగతి పరీక్ష పత్రాల మూల్యాంకనం చేసిన ఉపాధ్యాయులకు భత్యం నిధులను వెంటనే జమ చేయాలని ఎస్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆవుల శ్రీనివాసులు డిమాండ్ చేశారు. కడప ఎస్‌టీఎఫ్ కార్యాలయంలో జరిగిన జిల్లా నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2025 పది పరీక్షలకు చీఫ్, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్, స్క్వాడ్ రెమ్యూనరేషన్ ఇంతవరకూ విడుదల చేయలేదన్నారు. బదిలీలలో భాగంగా రీ అపోస్‌మెంట్‌లో వచ్చిన ఉపాధ్యాయులకు పొజిషన్ ఐడీలు కేటాయించి జీతాలు చెల్లించాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుపాకుల మురళి, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శులు బాలకృష్ణ, రవిశంకర్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బోనాలు



పూజలందుకుంటున్న అంకాలమ్మ

పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణంలోని అంకాలమ్మ తల్లికి ఆదివారం భక్తులు బోనాలు సమర్పించి చల్లంగ చూడమ్మ అంకాలమ్మ తల్లి అని వేడుకున్నారు. ఆలయ అర్చకులు సురేష్, ఈశ్వర్ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి వెండి మకరతోరణంతో విశేష పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. భక్తులు అమ్మవారికి నిమ్మకాయల దండలు, బోనాలు సమర్పించి కాయకర్పూరాలు అందజేశారు. అలాగే అమ్మవారికి చీరలు, గాజులు, పువ్వులు అందజేసి తమ మొక్కులు తీర్చుకున్నారు. వర్షాలు బాగా కురిసి రైతులను, ప్రజలను ఆదుకోవాలని వేడుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చైర్మన్ నాగేంద్రప్రసాద్ పర్యవేక్షించారు.

బాబు హామీలను ఎండగడుదాం

- ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వ వైఫల్యాలను చెబుదాం
- ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ పిలుపు





సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, క్యూర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ

కాశినాయన : ఎన్నికల సమయంలో చంద్రబాబు నాయుడు ప్రజలకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా నెరవేర్చకపోవడంతో అన్ని వర్గాల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని, దీనిని దృష్టిలో ఉంచుకుని హామీలతో ఎంతగా ప్రజలను వంచించారో ప్రజల్లో ఎండగట్టాలని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని నరసాపురం బీఎస్‌రెడ్డి స్కూల్ ఆవరణలో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. బాబు హామీలు, మోసాలపై క్యూఆర్ కోడ్‌ను పార్టీ నేతలతో కలసి ఎమ్మెల్సీ డీసీ గోవింద రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి డి.ఆదిత్య రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి మాట్లాడుతూ అధికారమే పరమావధిగా ఎన్నికల్లో అడ్డగోలు హామీలు ఇచ్చి వాటిని నెరవేర్చకపోవడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని విమర్శించారు. తమ ప్రభుత్వ పాలనలో ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవలు అందిస్తే వాటిని చంద్రబాబు నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. నిరుద్యోగ భృతి పేరిట యువతను, ఉచిత బస్సు ప్రయాణం పేరుతో మహిళలను, పెట్టుబడి సాయం పేరుతో రైతులను దగా చేశారని దుయ్యబట్టారు. బాబు చేసిన ఈ వంచన, దగా, మోసాన్ని ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు.

భయపడే ప్రసక్తే లేదు

కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించినా, నిలదీసినా అక్రమ కేసులు బనాయించడమే పనిగా పెట్టుకున్నారని, దీనికి భయపడే ప్రసక్తే లేదని ఎమ్మెల్సీ గోవిందరెడ్డి స్పష్టం చేశారు. బద్వేలు నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై తప్పుడు కేసులు పెడుతున్నారని అన్నారు. ఇలాంటి సంస్కృతి నియోజకవర్గంలో ఎప్పుడూ లేదన్నారు. దివంగత మాజీ మంత్రి బిజివేముల వీరారెడ్డి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించారని, ఆయన మనువడు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రితేష్‌రెడ్డి నేడు కమీషన్లకు కక్కుర్తి పడి రూ.లక్షలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.40కోట్లతో లిఫ్ట్ ఇరిగేషన్ పనులు మంజూరు చేయించామని, అందులో భాగంగా మొదట తెలుగు గంగ కాలువ నుంచి వరికుంట్ల చెరువుకు రూ.10కోట్లతో పైపులైన్ నిర్మించామన్నారు. రూ.4–5 కోట్లు ఖర్చు పెడితే వరికుంట్ల చెరువుకు నీరు అందుతుందన్నారు. టీడీపీ నాయకులు ఇటువంటివాటిపై దృష్టి సారించకుండా కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు.

అబద్ధపు హామీలు

ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికలకు ముందు అబద్ధపు హామీలు ఇచ్చి గెలిచి అధికారంలోకి వచ్చారని ఎమ్మెల్యే డాక్టర్ సుధ విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయక ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై, నాయకులపై తప్పుడు కేసులు పెట్టి వేధిస్తున్నారన్నారు. ఎవరు భయపడకుండా పార్టీ కోసం పని చేయాలని అండగా ఉంటామని ఆమె భరోసా ఇచ్చారు. అనంతరం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి దేవసాని ఆదిత్యరెడ్డి మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇంటి వద్దకే పథకాలు అందేవని, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో అబద్ధాలు చెప్పడం తప్ప పథకాలు అమలు చేసిన దాఖలాలు లేవని విమర్శించారు. కూటమి నాయకుల బెదిరింపులకు బెదిరే ప్రసక్తే లేదన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ హనుమంతురెడ్డి, నియోజకవర్గ బూత్‌కన్వీనర్ కరెంట్ రమణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పంగా గురివిరెడ్డి, గొంటువారిపల్లె రమణారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా యాక్టివేట్ కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి, సమాచార సంయుక్త కార్యదర్శి నాగసుబ్బారెడ్డి, రాజశేఖరరెడ్డి, వెంకటకృష్ణారెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, రాజుగాళ్ల వెంకటరెడ్డి, రమణారెడ్డి, నరసింహారెడ్డి, సర్పంచ్ వెంకటరామిరెడ్డి, ఓబుళరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

తారస్థాయికి చేరిన కక్షసాధింపు రాజకీయాలు



సీఎం.దావూద్

ప్రొద్దుటూరు : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కక్ష సాధింపు రాజకీయాలు తారస్థాయికి చేరాయని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు సీఎం.దావూద్ అన్నారు. విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడుతూ ఉద్యోగులను బెదిరించి, బ్లాక్‌మెయిల్ చేసి స్టేట్‌మెంట్లు తీసుకుని మద్యం అక్రమ కేసులో ఎంపీ మిథున్‌రెడ్డిని ఇరికించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. చంద్రబాబు రాజకీయ జీవితమంతా కుట్రలతో సాగుతోందని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తుండటంతోనే వైఎస్సార్‌సీపీ కీలక నేతలపై కేసులను పెట్టి అరెస్టు చేస్తున్నారని మండిపడ్డారు. 2014–19లో చంద్రబాబు, ఆయన ప్రభుత్వంలోని మంత్రులు, సన్నిహితులపై దాదాపు 13 అవినీతి కేసులున్నాయని, అందులో మద్యం కుంభ కోణం కేసు కీలకమైందన్నారు. 2014–19 మధ్య లిక్కర్ స్కాంలో చంద్రబాబు అడ్డంగా దొరికి పోయారని, అలాంటి చంద్రబాబు ఇప్పుడు అధికారంలోకి రాగానే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కీలకంగా పని చేసిన వారిపై కక్ష సాధింపుతో ఎదురు కేసులు పెట్టిస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో ఒక్క బెల్ట్ షాపు లేదని, ప్రభుత్వమే పారదర్శకంగా మద్యం దుకాణాలు నిర్వహించిందన్నారు. కానీ నేడు గ్రామాల్లో ఎక్కడ చూసినా బెల్ట్ షాపులు దర్శనమిస్తున్నాయని తెలిపారు. ప్రజా ప్రతినిధులు మద్యం మాఫియా చేస్తున్నారని విమర్శించారు. ఎంపీ మిథున్‌రెడ్డి వైఎస్ జగన్‌కు సన్నిహితంగా ఉంటారని, అందుకే ఆయనను అరెస్ట్ చేశారన్నారు. చంద్రబాబు చర్యలకు తప్పకుండా భవిష్యత్తులో మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందన్నారు. సిట్ కట్టుకథలతో అల్లుతున్న మద్యం అక్రమ కేసు న్యాయస్థానాల్లో నిలబడదని తెలిపారు.

విద్యా వ్యతిరేక విధానాలపై పోరాటం



కరపత్రాలను విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

బద్వేలు అర్బన్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై పోరాటాలు కొనసాగిస్తామని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరపోగురవి పేర్కొన్నారు. ఈ నెల 30, 31వ తేదీల్లో బద్వేలులో నిర్వహించనున్న ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ సమావేశాలను జయప్రదం చేయాలని ఆదివారం స్థానిక ఎస్సీ బాలుర వసతిగృహంలో కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానం పేరుతో విద్యను కాషాయీకరణ, ప్రైవేటీకరణ చేస్తోందని మండిపడ్డారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవుతున్నప్పటికీ ఉన్నత విద్యకు సంబంధించిన రూ.6400 కోట్లు ఫీజురీఎంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు పెండింగ్‌లో ఉంచడం దారుణమన్నారు. ఎన్నికల సమయంలో ఎంత మంది విద్యార్థులు ఉంటే అంత మందికి తల్లికి వందనం ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక అనేక రకాల షరతులు పెట్టి కోతలు విధించడం దారుణమన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి భవిష్యత్ పోరాటాలు రూపకల్పన చేసేందుకు జిల్లా ప్లీనరీ సమావేశాలు వేదిక కానున్నాయని, ఈ సమావేశానికి విద్యార్థులు, మేధావులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ నాయకులు శ్రీనివాసులు, సుకాంత్, రాజశేఖర్, సుదర్శన్, శివానంద, సంతోష్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గ సభ్యులు

బద్వేలు అర్బన్ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం బద్వేలు తాలూకా నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. స్థానిక పోరుమామిళ్ల రోడ్డులోని పెన్షనర్స్ అసోసియేషన్ సభా భవనంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా ట్రెజరర్ చంద్రశేఖర్ ఎన్నికల అధికారిగా వ్యవహరించిన ఈ ఎన్నికలో తాలూకా అధ్యక్షుడిగా హుస్సేనయ్య, కార్యదర్శిగా పుష్పరాజు, ట్రెజరర్‌గా విజయకుమార్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా బాలయ్య, ఉపాధ్యక్షులుగా నరసింహప్రసాద్, బ్రహ్మజీ, లక్ష్మిదేవి, శ్రీహరి, సుబ్బరాయుడు, రఘునాథరెడ్డి, కొండయ్య, జాయింట్ సెక్రటరీలుగా పుష్పాంజలి, సుధ, లీలావతి, ధనలక్ష్మిదేవి, రామచంద్ర, చంద్రకళ, నాగమణి, రామచంద్రుడు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా జి.లక్ష్మిదేవి, ఉమెన్స్ సెక్రటరీగా సుబ్బులక్షమ్మను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తామని తెలిపారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు రఘురామనాయుడు, జిల్లా కార్యదర్శి కృష్ణప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి, విశ్రాంత వ్యవసాయాధికారి ఆవులశ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను సన్మానిస్తున ఎస్టీయూ నాయకులు

కలసపాడు : మండలంలోని వివిధ పాఠశాలల్లో పని చేస్తూ బదిలీపై ఇతర మండలాలకు వెళ్లిన ఉపాధ్యాయులను ఎస్టీయూ కలసపాడు మండల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఎంఈఓ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి.రమణారెడ్డి మాట్లాడుతూ జిల్లాలోనే మారుమూల మండలమైనప్పటికీ గ్రామాల్లో బాధ్యతాయుతంగా పనిచేసి విద్యాభివృద్ధికి బదిలీ అయిన ఉపాధ్యాయులు చేసిన కృషి అభినందనీయమన్నారు. పాఠశాలల్లో విద్యార్థులతో, సహ ఉపాధ్యాయులతో, తల్లిదండ్రులతో వారు మెలిగిన తీరు ఆదర్శనీయమన్నారు. రకరకాల యాప్‌ల భారంతో, బోధనేతర కార్యక్రమాలతో, బోధన అంశాలపై పూర్తి దృష్టి సారించలేక ఉపాధ్యాయులు సతమతమవుతున్నారని తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్ డీఏలను, మధ్యంతర భృతి, పీఆర్సీ బకాయిల చెల్లింపు తదితర అంశల్లో ప్రభుత్వ తీరు దారుణంగా ఉందన్నారు. ప్రతి ఆరు నెలలకు ఒక సారి ప్రకటించాల్సిన డీఏల విషయంలో, ఐదేళ్లకోసారి అమలు చేయాల్సిన పీఆర్సీ విషయంలోనూ ప్రభుత్వం మొండి వైఖరి సరికాదన్నారు. వెంటనే 30 శాతం ఐఆర్ ప్రకటించాలన్నారు. లేని పక్షంలో ఉపాధ్యాయ సంఘాల ఉద్యమ పంథ ఎలా ఉంటుందో చవిచూడక తప్పదన్నారు. అనంతరం బదిలీ అయిన 16 మంది ఉపాధ్యాయులకు పూలమాల, శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా మహిళా కమిటీ కన్వీనర్ కవిత, సుబ్రహ్మణ్యం, మండల అధ్యక్షుడు వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు శేఖర్‌బాబు, సత్యనారాయణ, రాజగోపాల్‌రెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పెద్దమ్మ జాతర



పెద్దమ్మ తల్లికి పూజలు చేస్తున్న ఆదిత్యారెడ్డి

పోరుమామిళ్ల : మండలంలో బుచ్చంపల్లెలో ఆదివారం ఘనంగా పెద్దమ్మ తల్లి జాతర నిర్వహించారు. జాతరలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి దేవసాని ఆదిత్యారెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట వైస్ ఎంపీపీలు సీఎం బాషా, చెన్ను రాజశేఖర్, విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు సాయి నారాయణరెడ్డి, నాయకులు పీరయ్య, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

అలాగే బుచ్చంపల్లె ప్రజల ఆహ్వానం మేరకు రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారు నాగార్జునరెడ్డి, డాక్టర్ మార్కారెడ్డి, డాక్టర్ మాబు, పార్టీ నాయకులు ఓబయ్య, బాబు తదితరులు పెద్దమ్మ జాతరలో పాల్గొన్నారు.

సవాళ్లతో వేడెక్కిన 'రంగసముద్రం'



మాట్లాడుతున్న చాపాటి లక్ష్మీనారాయణరెడ్డి

పోరుమామిళ్ల : ప్రభుత్వ భూములు, చెరువు లోతట్టు భూములను కబ్జా చేశారని ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోవడం.. అధికారులకు ఫిర్యాదు చేయడంతో రంగసముద్రం పంచాయతీ వేడెక్కింది. అధికారపార్టీ నాయకుడికి ధీటుగా సమాధానం చెప్పడమే కాక, టైమ్, డేట్, ప్లేస్ చెపితే ఆధారాలతో సహా నిరూపిస్తానని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చాపాటి లక్ష్మీనారాయణరెడ్డి సవాల్ విసిరారు. చెరువు ఆయకట్టు చైర్మన్ వీర చెంద్రాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు చాపాటి నారాయణరెడ్డి మధ్య 15 రోజులుగా వాదోపవాదనలు సాగుతున్నాయి. శనివారం వీర చెంద్రాయుడు, చాపాటి లక్ష్మీనారాయణరెడ్డిపై ఆరోపణలు గుప్పించారు. దీంతో ఆదివారం విలేకరులతో లక్ష్మీనారాయణరెడ్డి మాట్లాడుతూ వీర చెంద్రాయుడు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మాజీ జవాన్ నాగరాజు పేరుతో కబ్జా చేసిన భూములు ఆధారాలతో నిరూపిస్తానని, వీరచెంద్రాయుడు చేసిన భూ కబ్జాలు, ఆక్రమణలు బయట పెడతానని పేర్కొన్నారు.

సిమెంట్ రోడ్డు ధ్వంసంపై ఎమ్మెల్యే పుట్టా స్పందించాలి

– వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ నియోజకవర్గ కన్వీనర్ బాబ్జీ

చాపాడు : మండలంలోని తిప్పిరెడ్డిపల్లె దళితవాడకు వెళ్లే సిమెంట్ రోడ్డును టీడీపీకి చెందిన నంది మండలం మల్లికార్జునరెడ్డి ధ్వంసం చేయడంపై ఆ పార్టీ ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ స్పందించాలని వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ నియోజకవర్గ కన్వీనర్ గొడుగు బాబ్జీ డిమాండ్ చేశారు. 30 ఏళ్లుగా దళితవాడకు వెళ్లే దారిలో సీమెంట్ రోడ్డు లేకపోవడంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన ఏడాదిలోనే దళితుల సౌకర్యం సిమెంట్ రోడ్డు నిర్మించిందన్నారు. టీడీపీ ప్రభుత్వం వచ్చిన ఏడాదికే ఆ రోడ్డును టీడీపీ నాయకులు స్థలం తమదని రోడ్డును ధ్వంసం చేయడం ఎంత వరకూ సమంజసమన్నారు. పేదల పక్షపాతినని చెప్పుకునే టీడీపీ ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ తన పార్టీ నాయకులు చేసిన రోడ్డు ధ్వంసంపై స్పందించాలని, దీనిపై చట్టపరమైన తీసుకోవాలన్నారు. దళితుల పట్ల ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని బాబ్జీ కోరారు.

యాత్రను జయప్రదం చేయండి

గోపవరం : ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఆగస్టు 3వ తేదీన కుప్పం నుంచి ఇచ్ఛాపురం వరకు నిర్వహించే రాజ్యాంగ పరిరక్షణ యాత్రను జయప్రదం చేయాలని మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి మీసాలరవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ జనాభా ఆధారంగా 20 శాతం రిజర్వేషన్ పెంచాలని, క్రిమిలేయర్ రద్దు, ప్రైవేటు రంగాల్లో రిజర్వేషన్ అమలు చేయాలని నిర్వహించే ఈ యాత్రలో మాల ఉద్యోగ సంఘాలు, మాల జేఏసీ నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అవకతవకలపై విచారణ జరపాలి

బద్వేలు అర్బన్ : పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో క్షయవ్యాధి విభాగంలో సీనియర్ ట్రీట్మెంట్ ల్యాబ్ సూపర్‌వైజర్‌గా విధులు నిర్వర్తిస్తున్న బ్రహ్మయ్యపై వచ్చిన ఆరోపణల మీద జరిగిన విచారణలో అవకతవకలపై జిల్లా అధికారులు విచారణ జరపాలని ఏఐఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పి.ప్రభాకర్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ల్యాబ్ సూపర్‌వైజర్ బ్రహ్మయ్య విధులకు సక్రమంగా హాజరు కాకుండా కడపలోని సొంత ల్యాబ్‌లో పనిచేస్తున్నట్లు రాష్ట్రస్థాయి, జిల్లా స్థాయి అధికారులకు ఫిర్యాదు చేయడం జరిగిందని, సదరు ఫిర్యాదుపై జరిపిన విచారణలో బ్రహ్మయ్య విధులకు సక్రమంగా హాజరవుతున్నట్లు వైద్యశాఖ జిల్లా అధికారులు నివేదిక ఇవ్వడం సరికాదన్నారు. తక్షణమే విచారణలో జరిగిన అవకతవకలపై పూర్తిస్థాయిలో విచారణ జరపాలని కోరారు. సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి శివ, ఉపాధ్యక్షుడు నాగేంద్ర పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్: కడప రామాంజనేయపురంలోని ఆంధ్ర ప్రదేశ్ గురుకుల పాఠశాల(మైనారిటీ బాలురు)లో మిగిలిన సీట్లకు మైనార్టీ విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తున్నట్లు ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ రామచంద్ర తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు 5, 6, 7వ తరగతులలో మిగిలిన సీట్లకు ఎలాంటి రాత పరీక్ష లేకుండా నేరుగా అడ్మిషన్ పొందవచ్చని ఆయన తెలిపారు. తగిన ధ్రువపత్రాలతో పాఠశాలను సంప్రదించి అడ్మిషన్ పొందవచ్చని తెలిపారు.

బాలసాహిత్యంపై సదస్సు

కడప ఎడ్యుకేషన్: వైవీయూ ఆధ్వర్యంలోని సిపి బ్రౌన్ భాషా పరిశోధనా కేంద్రంలో ఈ నెల 27న సదస్సు నిర్వహిస్తున్నట్లు బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి పేర్కొన్నారు. ఈ సదస్సులో ×ఆర్.సి.కృష్ణస్వామి రాజు బాలసాహిత్యం అంశంపై విశ్రాంత తెలుగు అధ్యాపకులు డాక్టర్ నెమిలేటి కిట్టన్న (తిరుపతి) ప్రసంగిస్తారని పేర్కొన్నారు. సాహితీ అభిమానులు హాజరుకావాలని ఆమె కోరారు.

ఆపరేటర్‌పై రైతుల ఫిర్యాదు

పులివెందుల రూరల్: నియోజకవర్గంలోని లింగాల మండలం తాతిరెడ్డి పల్లె గ్రామంలోని సబ్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ఆపరేటర్ చైతన్యకుమార్‌రెడ్డి పనితీరుపై స్థానిక రైతులు శివకృష్ణారెడ్డి, నరసింహారెడ్డి, నారాయణరెడ్డి, శంకరరెడ్డి, నాగార్జునరెడ్డి, సూర్యప్రతాప్‌రెడ్డితో పాటు మరో 30 మంది పులివెందులలోని విద్యుత్ కార్యాలయంలోని ఏడీ గురుమోహన్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ అధికారులు స్పందించి ఆపరేటర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంపై ఏడీ గురుమోహన్‌రెడ్డిని వివరణ కోరగా ఆపరేటర్ పనితీరు సరిగా లేదని రైతులు వినతిపత్రం ఇచ్చారని, ఈ విషయాన్ని ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు.

కుందూ నీటిని నమ్ముకొని...



బోరు కింద సాగులో ఉన్న మొక్కజొన్న పంట



సాగులో ఉన్న మిరప పంట



టంగుటూరు సమీపంలోని కుందూనదిలో పారుతున్న నీరు

కుందూనదిలో వస్తున్న నీరు, బోరు నీటిని నమ్ముకొని... రైతులు పంటలు సాగు చేశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నా వరుణ దేవుడు అరకొరగా కరుణించాడు. అయితే రాజుపాళెం మండలంలోని టంగుటూరు గ్రామ రైతులు పసుపు, మొక్కజొన్న, మినుము, నారుకయ్యలను అక్కడక్కడా సాగు చేశారు. పాడి రైతులు ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.35 వేల వరకు కౌలు చెల్లించి పశువులకు గడ్డి పెంచుకుంటున్నారు. వరుణదేవుడు కొద్ది మేర కరుణించడంతో పంటలు బాగానే ఉన్నాయని రైతులు చెబుతున్నారు.

– రాజుపాళెం